క్లుప్తంగా

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



ధాన్యం కొనుగోలుపై సూచనలు ఇస్తున్న కాకినాడ ఆర్డీవో సీతారామారావు

కాజులూరు: రైతు పండించిన ప్రతి గింజా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కాకినాడ ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. శనివారం మండల గ్రామాల్లో ఆర్డీవో తదితర అధికారులు పర్యటించి కొనుగోలు కేంద్రాలు, రైసుమిల్లును సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం నిర్ణీత సమయంలో రైసుమిల్లులకు చేరేలా రెవెన్యూ, వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖ సిబ్బంది నిరంతరం సమష్టిగా పర్యవేక్షించాలన్నారు. రవాణా ట్రక్ షీట్, తూనికలు, కొలతలకు సంబంధించి సిబ్బందికి ఆర్డీఓ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు పి.సుబ్బారావు, తాతపూడి శ్రీనివాసు, ఆర్ఐ వేగేశ్వరరావు, స్థానిక వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

'డీసీసీబీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తణుకువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మాచరరావు

కాజులూరు: గ్రామాల్లో డీసీసీబీ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం బ్యాంక్ మేనేజర్ ఎన్.మాచరరావు అన్నారు. శనివారం తణుకువాడ పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పితాని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా అమలవుతున్న ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. డీసీసీబీలో డిపాజిట్లపై అధిక వడ్డీ ఇవ్వటంతో పాటు బంగారు నగలపై తక్కువ వడ్డీకే రుణసదుపాయం కల్పిస్తుందని ప్రజలు తమ బ్యాంకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వేగిస వెంకట సుబ్బారావు, కార్యదర్శి పుల్లేపు వాడపల్లి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలే శరణ్యం



శీలలో విద్యార్థులకు బౌద్ధమతం విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ కోరుకొండ బాబ్జి

కాజులూరు: మానవ సర్వతోముఖాభివృద్ధికి బుద్ధుని బోధనలే శరణ్యమని ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో ప్రయనిస్తే జీవితాలు సుఖమయమౌతాయని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. శనివారం డాక్టర్ బాబ్జి, ఆయన సతీమణి కాకినాడ లైఫ్ లైన్ ఎమర్జెన్సీ హాస్పిటల్ ఎండీ భానుమతి వారి స్వగ్రామమైన కాజులూరు మండలం శీలలో పర్యటించారు. స్థానిక విద్యార్థులకు బౌద్ధమతం విశిష్టతను వివరించి స్థానికులతో బుద్ధవందనం చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వారం ఒకరోజు స్థానికులకు వైద్యసేవలు అందించడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై తగిన శ్రద్ధ పెట్టాలన్నారు.

మతతత్వ శక్తుల తిరోగమనం

కపిలేశ్వరపురం: కర్ణాటకలో బీజేపీ ఓటమి ద్వారా మతతత్వ శక్తుల తిరోగమనం ప్రారంభమైందని సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి శనివారం తెలిపారు. భజరంగ్‌దళ్‌ను బీజేపీ ఫోకస్ చేసినప్పటికీ కర్ణాటక ప్రజలు మత సామరస్యానికే ఓటేశారన్నారు. కర్ణాటకలో ఓటమితో బీజేపీ దేశ వ్యాప్తంగా బలహీనపడటం ద్వారా బీజేపీయేతర రాష్ట్రాల్లో పాలనకు స్వేచ్ఛ వచ్చినట్టేనని కృష్ణవేణి అన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

రోడ్ల విధ్వంసం



గొల్లపాలెంలో రోడ్డుపై యథేచ్ఛగా ప్రయాణిస్తున్న వరి నూర్పిడి యంత్రం

- నాడు దమ్ము ట్రాక్టర్లు, నేడు నూర్పిడి యంత్రాలు
- రహదారిపై యథేచ్ఛగా వరికోత మెషీన్ల పయనం
- చోద్యం చూస్తున్న అధికారులు

కాజులూరు: గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు పలు గ్రామీణ రహదారులు చిత్తుచిత్తయ్యాయి. ఈ రహదారులను ఇటీవలే ప్రభుత్వం దశల వారీగా పునర్నిర్మిస్తూ వస్తుంది. అయితే రూ.కోట్లు ప్రజాధనంతో ప్రభుత్వం పునర్నిర్మిస్తున్న ఈ రహదారులు కొందరి వరికోత మెషీన్ల యజమానుల స్వార్థ ప్రయోజనాల కారణంగా మరింత ధ్వంసమవుతున్నాయి. ఏటా పంట దమ్ముల సమయాల్లో పలువురు ట్రాక్టర్ యజమానులు నిబంధనలకు తుంగలోకి తొక్కి, దమ్ము చక్రాలతో రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ రోడ్లను చిత్తుచిత్తు చేస్తుండగా ప్రస్తుత మాసూళ్ల సమయంలో ఈ వరినూర్పిడి యంత్రాలూ అదేపని చేస్తున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండల గ్రామాల్లో ప్రస్తుతం రబీ మాసూళ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒక ప్రాంతంలో నూర్పిడి యంత్రానికి పని పూర్తయిన తర్వాత మరో ప్రాంతానికి వెళ్లాలంటే ట్రాలీ లారీపై తరలిస్తుంటారు. అయితే అదే గ్రామంలోనో, సరిహద్దు గ్రామంలోనో పని ఉంటే రోడ్డు మార్గం ద్వారా నూర్పిడి యంత్రాలను ట్రాక్టర్లలానే రోడ్డుపై నడుపుకుంటూ తీసుకువెళుతున్నారు. నూర్పిడి యంత్రాలు తడి, తడిగా ఉండే పంటపొలంలోనూ తిరిగేందుకు వీలుగా వాటికి చక్రాల స్థానంలో ఇనుప బెల్టులు అమర్చబడి ఉంటాయి. ఇనుప బెల్టులతో నూర్పిడి యంత్రాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో సీసీ రోడ్లు, తారురోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇనుపబెల్టుల తాకిడికి రోడ్లు పగుళ్లు తీసి రాళ్లు లేచిపోవడంతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో కాకినాడ-కోటిపల్లి, యానం-ద్వారపూడి, యానం-జొన్నాడ, కాజులూరు-రామచంద్రపురం, గొల్లపాలెం-యానం రహదారులతో పాటు గ్రామీణ రహదారులు ఈ నూర్పిడి యంత్రాల తాకిడికి గురై పాడైపోతున్నాయి. వీటిపై స్థానికులు ఫిర్యాదులు చేసినా నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్ల యజమానుల్లో పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఎక్కువగా ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమను కట్టడి చేసే వారు లేరన్న గర్వంతో వరికోత మెషీన్ల డ్రైవర్లు యథేచ్ఛగా రోడ్డుపై నూర్పిడి యంత్రాలను తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూర్పిడి యంత్రాల బారీ నుంచి గ్రామీణ రహదారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కాజులూరులో నూర్పిడి యంత్రం పయనించడంతో ధ్వంసమైన రహదారి

లోక్ అదాలత్‌లో 666 కేసుల పరిష్కారం

రామచంద్రపురం: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ మెగా లోక్ అదాలత్‌లో రూ.88,85,317 విలువైన 666 కేసులు పరిష్కారం అయినట్టు సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్‌లు తెలిపారు. వీటిలో రూ.58,94,917 విలువైన సివిల్ కేసులు 17, రూ.28,75,000 విలువైన క్రిమినల్ కేసులు 31, రూ.33,000 విలువైన ఎస్‌టీసీ కేసులు 615, రూ.82,400 విలువైన పీఎల్‌సీ కేసులు 3 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, లోక్‌అదాలత్ ప్యానల్ మెంబర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులకు రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 12వ వార్డులో గడప గడపకూ..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలసి శనివారం స్థానిక 12వ వార్డులో ఎమ్మెల్సీ తోట పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి అవసరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం

12వ వార్డులో ఎమ్మెల్సీ తోటకు ఘన స్వాగతం లభించింది. కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి, అప్పన్న దంపతులు, పార్టీ నేత సిరంగు శ్రీనువాస్ ఆధ్వర్యంలో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు జిన్నూరి సాయిబాబా, వల్లూరి రామకృష్ణ, టేకిమూడి శ్రీనివాస్, శెట్టి నాగేశ్వరరావు, పేపర్తి సాంబు, షేక్‌మస్తాన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



బైపాస్‌రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజుబాబు తదితరులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు ప్రారంభోత్సవం

మండపేట: పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ అన్ని వార్డుల్లో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్ష నాయకుల కళ్లకు కనిపించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. స్థానిక మారేడుబాక వంతెన వద్ద నుంచి దిబ్బగరువు వంతెన వరకూ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.97 లక్షలతో అభివృద్ధి చేసిన ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డును శనివారం వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నాలుగు మీటర్లు ఉన్న బైపాస్ రోడ్డును పెరిగిన ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా అవకాశం ఉన్నంత వరకు ఏడు మీటర్లకు విస్తరించి అభివృద్ధి చేశామన్నారు. తనకు అప్పగిస్తే ఈ రోడ్డును 10 మీటర్లకు విస్తరిస్తానని ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తమ ప్రభుత్వంలో ఆ పని ఎందుకు చేసి చూపించలేదని ప్రశ్నించారు. రోడ్డు పక్కన కాలువ ఉండగా 10 మీటర్లు రోడ్డు కాలువలో వేస్తారా అని ఎమ్మెల్సీ తోట ఎద్దేవా చేశారు. అసత్యాలు మాట్లాడితే ప్రజలు హర్షించరని హితవు పలికారు. పట్టణ ప్రముఖుడు బిక్కిన చిన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, గ్రంధి శ్రీనివాస్, మెండు బాపిరాజు, అమలదాసు లక్ష్మి, పిల్లి శ్రీనివాస్, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సిరంగు శ్రీను, యాంగ్ర ప్రభాకరరావు, అముజూరి శ్రీను, గెద్దాడ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

- సాయంత్రం 4 గంటలకు ద్వారపూడిలో..
- ఘనంగా ఏర్పాట్లు



మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మండపేట: మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరగనుంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండలంలోని ద్వారపూడిలో నిర్వహించే వేడుకకు పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. నియోజకవర్గంలోని మండపేట అర్బన్, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలతో ద్వారపూడి కేంద్రంగా రెండేళ్ల క్రితం మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఏర్పడింది. తొలి చైర్‌పర్సన్‌గా 2020 ఫిబ్రవరిలో రాయవరానికి చెందిన తేతల వనజ నియమితులై బాధ్యతలు నిర్వర్తించారు. పాత పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో కొత్త కమిటీని నియమిస్తూ ఇటీవల వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదేశాలు ఇచ్చింది.

కొలువుదీరనున్న కొత్త పాలకవర్గం

ఏఎంసీ చైర్మన్‌గా రాయవరం మండలం నదురుబాదకు చెందిన సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా మండపేట మండలం ద్వారపూడికి చెందిన చిక్కాల శ్రీనివాసరావు, సభ్యులుగా ముగ్గుళ్ల పార్థకృష్ణ, పలివెల సుధాకర్, తుమ్మా రమాదేవి, సమతం పాపారావు, కొప్పిరెడ్డి పద్మావతి, కురుపూడి భువనేశ్వరి, కనికెళ్ల పల్లవి, చింతా సరస్వతి, సురుకుర్తి వీరవేణి, షేక్ మస్తాన్, కర్రి శ్రీతులసి, ప్రగడ సూర్యారావు, తాడి హరినారాయణరెడ్డి తదితరులు నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ద్వారపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయం పక్కన గల టీఎంసీ కల్యాణ మండపంలో పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరగనుంది. అందుకోసం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాణ స్వీకార వేడుకకు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు కూడా హాజరుకానున్నారు.

రేపు సువర్చలా సమేత ఆంజనేయుని కల్యాణం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన సువర్చల సమేత ఆంజనేయ స్వామి కల్యాణం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏటా సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణం ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు గ్రామానికి చెందిన పప్పులు మసేను వెంకన్న(రేవు శ్రీను) కుటుంబస్తులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో సతీసమేత ఆంజనేయ స్వామి ఆలయం కోటిపల్లిలో ఉండడం విశేషం.

హనుమత్ జయంతికి ఏర్పాట్లు

మండపేట: హనుమత్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా గల భక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం ప్రసాద వితరణ, మధ్యాహ్నం పెద్ద ఎత్తున భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది. అలాగే సీతారామ క్షేత్రంలో, కలువ పువ్వు సెంటర్‌లోని వీరాంజనేయస్వామి వారి ఆలయం, రథం గుడిలో పెద్ద ఎత్తున హనుమత్ జయంతి వేడుకల నిర్వహణకు ఆయా ఆలయ కమిటీల వారు ఏర్పాట్లు చేశారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



కె.గంగవరంలో కోత కోస్తున్న కూలీలు

కె.గంగవరం: గత మూడు రోజులుగా వాతావరణం అనుకూలించడంతో మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అకాల వర్షాల కారణంగా కోతలను వాయిదా వేసుకున్న రైతులు ఎండలు కాయడంతో నేల ఆరుదల ఉన్న పంట పొలాల్లోని వరిని భద్రం చేసే పనిలో పడ్డారు. ఒకవైపు ఎంత తీవ్రతకు కూలీలు పనులు రాకపోవడంతో యంత్రాల ద్వారా వరి కోత పనులు చేస్తున్నారు. నేల ఇంకా ఆరని పంట పొలాల రైతులు కూలీలను బుజ్జగించి కూలీ రేట్లు పెంచి మరి వరి కోత కోయిస్తున్నారు. మరో వారం రోజులు వాతావరణం అనుకూలిస్తే ధాన్యం అమ్మకాలు పూర్తవుతాయని రైతులు ఆశతో ఉన్నారు. ఈ ఏడాది వరి అనుకున్నంత కన్నా ఎక్కువగా సాగవడంతో రైతుల ఆనందం వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా కొంత వరకు ఆందోళన చెందిన ప్రస్తుతం మాత్రం ఆనందంతో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రూరల్‌లో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ప్రస్తుతం రైతులు వరిసాగు చేస్తున్నారు.

మండపేటలో కాంగ్రెస్ సంబరాలు



విజయోత్సవ ర్యాలీలో కామన తదితరులు

మండపేట: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో శనివారం పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా కాల్పులతో స్థానిక కలువపువ్వు సెంటర్ నుంచి రాజారత్న సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ కర్ణాటక ప్రజలు బీజేపీ అరాచక పాలనకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న జనాదరణకు ఈ ఫలితాలు నిదర్శనమని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు పిల్లి అప్పన్న, మగ్గం జాకబ్‌రాజు, జువ్వల ఆదినారాయణ, వాసిరెడ్డి బాబురావు, కొండ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.